ఈవారం కథ

# అరణ్యరోదనం

– ఎల్.ఆర్. స్వామి

ఫ్యాను తిరుగుతున్నా గాలి లేనట్లే అనిపించింది. చాలా ఉక్కగా వుంది. మృగశిరాప్రవేశం అయినా ఎండ జోరు యింకా తగ్గలేదు.

గత రెండు మూడు నెలలుగా పట్టి పీడిస్తున్న ఎండాకాలానికి, కారాగార శిక్ష విధించమని నల్లకోటు తొడుగుకున్న మబ్బులు వాదిస్తూనే వున్నాయి, కానీ తీర్పు ఇంకా ఇవ్వలేదు.

చాలా దాహం వేసింది. ఒక కూల్‌డ్రింక్ తాగితే బాగుండును. 'బార్ కౌన్సిల్' లైబ్రరీ నుంచి బయటకు వచ్చి చూసాను, 'తాత' కనిపిస్తాడేమోనని.

తాత జాడ లేదు.

అక్కడక్కడే తిరుగుతూ వుంటాడు అతను. 'టీ' కావాలి అన్నా, కూల్‌డ్రింక్స్ కావాలన్నా, తెచ్చియిస్తూ వుంటాడు. గుమస్తాకు ఏదైనా కబురు చెప్పమంటే వెళ్ళి చెప్తాడు. కానీ ఈ రోజు అసలు కనబడలేదు అతను. గబగబా మెట్లు దిగి గుమస్తా దగ్గరకు వెళ్ళాను.

"తాత ఏమైపోయాడు?" అడిగాను.

"ఏమో నేను చూడలేదండీ, అమ్మాయిగారూ" అన్నాడు అతను. "మీకేం కావాలి?"

"కూల్‌డ్రింక్ తెప్పించండి"

గబగబా మెట్లు ఎక్కి 'బార్ కౌన్సిల్ లైబ్రరీ' చేరుకున్నాను; ఓ పుస్తకం పుచ్చుకుని కూర్చున్నాను.

పుస్తకం పుచ్చుకున్నానేగాని చదవలేకపోయాను. ఎందుకో నా ఆలోచనలు తాత చుట్టూ తిరిగాయి.

నాకు నవ్వు వచ్చింది. తాత నా బంధువూ కాదు, స్నేహితుడూ కాదు. అతనితో నా కెంతో పరిచయమూ లేదు. అయినా అతని గురించి నాకు ఎందుకు దిగులు?


"ఏంటే అలా పరధ్యానంగా కూర్చున్నావు?" వాణి గొంతు విని ఉలిక్కిపడ్డాను. "ఏ ముద్దాయి గురించి తల్లీ ఆలోచన?" నల్లకోటు చేతి మీదకు తీసుకుని అడిగింది వాణి. నేను మాట్లాడలేదు.

"ఎవరినైనా నీ బోనులో బంధించావా ఏమిటి?" మళ్ళీ అడిగింది వాణి.

నాకు కోపం వచ్చింది. "ఏంటా మాటలు?" గట్టిగానే అడిగాను.

"కోపం తెచ్చుకోకు తల్లీ. ఏదో సరదాగా అన్నాను."

నేను పుస్తకం వైపు తల తిప్పాను. ఓ నిముషం ఆగి అన్నాను. "ఈ రోజు తాత



కనిపించలేదు వాణీ".

"అదా నీ బెంగ? ఎక్కడో వుంటాడులే" వాణి అంది. "అయినా న్యాయవాదుల మైన మనకు సున్నితమైన మనస్సులు పనికిరావే సత్యా. తాత గురించి ఎందుకలా బాధపడిపోతున్నావు. నీ దగ్గరకు వచ్చే వందలాది క్లయింట్లలో ఒకడు అతను."

"నిజమేనే కానీ, న్యాయవాదిగా అతనికి న్యాయం చెయ్యలేకపోయాననే బాధ నన్ను పలువుకుతింటోందే."

"అలా సెంటిమెంటల్‌గా వుంటే ఈ వృత్తిలో మనం వుండలేమే తల్లీ" వాణి అంది. "నన్ను చూడు. నేను ఈ రోజు కేసు ఓడిపోయాను. నా క్లయింట్‌కి శిక్షపడింది. అయినా బాధపడుతున్నానా చెప్పు."

వాణి మామూలుగానే వుంది, సరదాగా నవ్వుతూ.

"చూడు మిగిలిన వృత్తుల్లాగే ఇది కూడా ఒక వృత్తే. జీవనోపాధి. మన వృత్తికి మనకి ఫీజు అందిందా, లేదా అని చూసుకోవాలిగానీ, న్యాయం చేసామా, లేదా అని ఆలోచించకూడదు. అలా ఆలోచిస్తే నీకు మనశ్శాంతి వుండదు. కేసు అయిపోగానే క్లయింట్‌ని కూడా మర్చిపోవాలంతే."

వాణి లేచింది "నాకు మరో కేసు వుంది" గౌను తొడుక్కుంటూ వెళ్ళిపోయింది ఆమె.

నేను వాణితో ఏకీభవించలేకపోయాను.

మనస్సులో తాతే కదిలాడు.

మాసిపోయి, నెరసిన గడ్డం, తైలసంస్కారం లేక గాలికి ఎగిరిపోతున్న జుత్తు, అక్కడక్కడ చినిగిపోయి నలిగిపోయిన పంచ, బుజం మీద ఓ తువ్వాలు – అదీ తాత రూపం.

కానీ, నేను మొదటిసారి తాతను చూసినప్పుడు అతను అలా వుండేవాడు కాదు. ఉక్కు లాంటి దృఢమైన అతన్ని చూస్తే ఏ నలుబది ఏళ్ళ మనిషో అయివుంటాడనుకున్నానుగాని, ఆరు పదులు దాటినవాడని అనుకోలేదు. తెల్లని గ్లాస్కో పంచె, లాల్చీలతో మిలమిలలాడుతూ వుండేవాడు.

నాకు తాతతో పరిచయం చాలా చిత్రంగా ఏర్పడింది. నాన్నగారి కేసొకటి వాయిదా కోరటం కోసం మొదటిసారిగా కోర్టుకి వెళ్ళాను, కారు దిగి మెట్లు ఎక్కుతున్నాను.

"నాకు న్యాయం చెయ్యండి అమ్మాయిగారు, నాకు న్యాయం చెయ్యండి" ఎవరో వంగి కాళ్ళకు దండం పెట్టారు.

హఠాత్తుగా ఆగిపోయాను, నేను.

"మీరైనా నాకు న్యాయం చెయ్యండి. మీకు పుణ్యం వుంటుంది."

"మా ఇల్లూ, పొలాలు లాగేసుకుని మమ్మల్ని, మా బ్రతుకుల్నీ రోడ్డు మీదకు లాగేస్తున్నారు అమ్మాయిగారు" అతను మళ్ళీ అన్నాడు.

గవర్నమెంటు ప్లీడరు చేసే నేరారోపణ విని ఆశ్చర్యపోయే నేరం చెయ్యని ముద్దాయిలా నిలబడిపోయాను.

"నువ్వు పద" నా వెనుక వచ్చిన వాణి అంది. "వాడికిది మామూలే. కనిపించిన ప్రతీ లాయర్నీ న్యాయం చెయ్యమని అడగడం, పిచ్చివాడు."

"నాకు పిచ్చిలేదు అమ్మాయిగారు. నా మాట నమ్మండి. నాకు న్యాయం చెయ్యండి."

అతని కళ్ళ నుంచి రాలిన కన్నీటి బిందువులు నా కాలి మీద వెచ్చగా పడ్డాయి. నా చెయ్యి పుచ్చుకుని నన్ను ఈడ్చుకుపోయింది వాణి.

"వాడి పొలాలేవో, ఏదో కర్మాగారానికని స్వాధీనం చేసుకుంటున్నారట" వాణి నడుస్తూ అంది. "ఆ పొలాల బదులుగా వ్యవసాయం చేసేందుకు, అతనికి పొలాలివ్వాలని అంటాడు అతడు. పిచ్చివాడు."

కోర్టులో పని ముగించుకుని ఇంటికి వచ్చినా, నా ఆలోచనలు అతని చుట్టూనే తిరిగాయి. ఏమిటి అతని సమస్య? ఏదో బలమైన సమస్యే లేకపోతే ఎందుకిలా పిచ్చివాడిలా ప్రవర్తిస్తాడు?

ఒకసారి అతనితో మాట్లాడితే బాగుంటుందని అనిపించింది.

ఇంటికి రమ్మని కబురుపెట్టాను.

"మాది నడుపూరండీ అమ్మాయిగారు" అతను అన్నాడు. "మాది పదెకరాల మాగాణీ. ఏదో వ్యవసాయం చేసుకుని బ్రతుకులు ఈడ్చేస్తున్నాము. గానీ..."

"గానీ... ..."

"మా వూరిలో ఏదో ఫ్యాక్టరీ కడతారట. దానికి బోలెడు భూమి కావాలట. అందుకని..."


"అందుకనీ ... ..."

"మా భూములు స్వాధీనం చేసుకొంటున్నారు."

"అంతే కదా. అందులో తప్పేమీ లేదే!"

"తప్పు లేదంటారేమిటండీ అమ్మాయిగారు. భూమి తీసేసుకుంటే, మేము బ్రతకడం ఎలా?"

"మీకు డబ్బులిస్తారు కదా?"



"ఆ ఇచ్చారులెండి పదిహేను వేలు..."

"పదిహేను వేలా! నాకు ఆశ్చర్యం వేసింది. పదిహేను వేలంటే ఎకరానికి పదిహేను వందలన్నమాట!

ఇదేళ్ళ క్రితమే మా నాన్నగారు నదుపూరవతల ఐదెకరాల పొలం కొన్నారు. ఎకరానికి పదివేలు చేసి కొన్నారన్నది నాకు బాగా గుర్తుంది. మరి ఇతను ఇలా అంటాడేమిటి?

"అయితే నీకు పదిహేను వేలు ముట్టాయన్నమాట" మెల్లగా అన్నాను.

"పదిహేను వేలు ఎక్కడ ముట్టిందమ్మాయిగారు. అందులో సగం ఆ డబ్బు తెచ్చుకోడానికి ఖర్చయిపోయింది కదండి. మిగిలిన డబ్బుతో నా బ్రతుకు ఎలా తెల్లారుతుందమ్మాయిగారు" గొల్లుమని ఏడ్చాడు తాత. "భూదేవి చలవ వల్ల కల్లో, గంజో త్రాగి బ్రతుకుతున్న మా కడుపులు కొట్టేసారు కదండీ. ముసలివాడిని, వ్యవసాయం తప్ప ఏ పనీ చేతకానివాడిని. మిగిలిన ఏడు వేల రూపాయిలతో నా బ్రతుకెలా గడుస్తుందమ్మాయిగారు."

నా కళ్ళు చెమర్చాయి. అతనికి ఏం జవాబు చెప్పాలో నాకు తోచలేదు. కర్మాగారం గురించి, భూములు కోల్పోయిన వేలమంది రైతులు ఇదే ప్రశ్న వేస్తున్నట్లు తోచింది నాకు.

తాత బలవంతం మీద ఓ రోజు నదుపూరు వెళ్ళాను. కర్మాగారంవారు భూమిని ఇంకా స్వాధీనం చేసుకోలేదట. ఒక్క అంగుళం భూమి కూడా విడిచిపెట్టకుండా ఏదో ఒక పంటలేసాడు తాత. నీటి సదుపాయం బాగా వుండడం వల్ల కాబోలు పొలమంతా పచ్చగా వుంది.

పొలం గట్టు మీద అటూ, ఇటూ తిరుగుతున్న నన్ను ఓ పాతిక మంది చుట్టుముట్టారు. పట్నం నుంచి వచ్చిన నన్ను చూడడానికి ఊరిలోని రైతులు చేరారని అనుకున్నాను.

"కాదమ్మాయిగారు" తాత అన్నాడు. "వీళ్ళంతా నా కొడుకులు, కోడళ్ళు., మనుమలు."

రెండేళ్ళ చంటిపిల్ల దగ్గర నుంచి, లంగా ఓణీ వేసుకునే అమ్మాయి వరకు వరుసగా ఐదుగురు ఆడపిల్లలు, ముప్పది సంవత్సరాల నుంచి నలుబది ఐదు సంవత్సరాల వరకు వయస్సు గల ఏడుగురు మొగపిల్లలు, వారి భార్యలు అంతా ఒక కుటుంబమే! వీళ్ళందరికీ జీవనోపాథి...

"అందరూ పొలంలో తలోపని చేస్తారండీ. వ్యవసాయం తప్ప మాకేపనీ రాదండీ."

మరోసారి వారివైపు చూసాను. కోర్టు కేసులో డబ్బంతా నష్టపోయి, సొమ్మరైపోయినవారిలా దయనీయంగా కనిపించారు వాళ్ళు.

లంగా, ఓణీ వేసుకున్న అమ్మాయి నన్ను బాగా ఆకర్షించింది.

"ఈ అమ్మాయి ఎవరూ?"

"సరస్వతి. నా పెద్ద మనుమరాలు."

"తొమ్మిదో తరగతి చదువుతున్నానమ్మగారు" ఆ అమ్మాయి అంది.

"దానికి చదవాలని వుందట" తాత అన్నాడు. "బాగా చదువుతోందట. మాస్టారన్నారు ప్రభుత్వంవారు ఏవో డబ్బులు కూడా ఇస్తున్నారు."

ఇంటికి వచ్చేసినా, నా మదిలో తాత కుటుంబమే మెదిలింది. ప్రశాంతంగా గడిచిపోతున్న అతని బ్రతుకులో పెనుతుఫాను రేపింది ఆ కర్మాగారం!

జీవనోపాధి కోల్పోయిన ఈ రైతులు రేపు రోడ్డు మీద పడతారు. పొట్ట నింపుకోటం కోసం, వాళ్ళలో కొంతమంది దొంగలుగా మారవచ్చు, మరికొంత మంది నక్సలైట్లుగా మారవచ్చు. దీనికి బాధ్యులెవరు?

నాకు ఆవేశం వచ్చింది. వీళ్ళకి ఏదైనా సహాయం చెయ్యాలి. వీళ్ళు రోడ్డు మీద పడడానికి వీలులేదు. జీవనోపాధి కోల్పోటానికి వీలులేదు.

నాన్నగారితో మాట్లాడాను. నలుబది ఏళ్ళుగా న్యాయవాద వృత్తిలో వున్న అతని అనుభవం నాకేదైనా మార్గం చూపుతుందేమోనని.

గానీ నాన్నగారు నన్ను నిరుత్సాహపరిచారు. ఇలాంటి కేసులు చేపట్టడం న్యాయవాదిగా పైకి రావడానికి దోహదం చెయ్యదన్నారు.

"మరి ఇది అన్యాయం కదా?" నేను అడిగేను. "పంట పొలాలు పరిశ్రమల కోసం స్వాధీనం చేసుకుంటే వాటి మీదే ఆధారపడి బ్రతికే రైతులు ఏమైపోతారు?"

"మరి పరిశ్రమలు రాకపోతే దేశమెలా పురోగమిస్తుంది?" నాన్నగారడిగారు. "భారీ పరిశ్రమలంటే చాలా భూమి కావాలి."

"నిజమే" నేనన్నాను. "పరిశ్రమలకు భూమి కావాలి కాని, పంటభూములే కావాలని లేదుగా?"

నాన్నగారు నా వైపు ప్రశ్నార్థకంగా చూసారు.

"బలుసాకు కూడా ఎదగని వందలాది ఎకరాలు మన దేశంలో వున్నాయి కదా. పరిశ్రమల కోసం అలాంటి భూములను కేటాయించవచ్చు కదా"

"కేటాయించవచ్చు" నాన్నగారు అటూ, ఇటూ పచార్లు చేస్తూ అన్నారు.

"కానీ ఆ నిర్ణయం తీసుకోవలసింది మనం కాదు కదా?"

ఓ నిముషం ఎవరూ మాట్లాడలేదు. ఆ తర్వాత నాన్నగారు మళ్ళీ అన్నారు. "మనం చెయ్యగలిగింది ఒక్కటే సత్యా. ఇచ్చిన నష్టపరిహారం తక్కువ అని, నష్టపరిహారం పెంచమని కేసు పెట్టవచ్చు. మరికొంత డబ్బు అతనికి ఇప్పించవచ్చు"

"అంతేనంటారా?"

"అంతే."

మరి నేను ఆలస్యం చెయ్యలేదు. నష్టపరిహారం పెంచాలని దావా వేసాను. దావాలో చిక్కుకుపోయిన క్లయింట్ చేతిలో డబ్బులాగా కాలం కరిగిపోయింది.

తాతకు అదనంగా నష్టపరిహారం చెల్లించాలని, తీర్పు ఇచ్చింది కోర్టు. కబురు పెడితే వచ్చాడు తాత.

"నా కెందుకండీ అమ్మాయిగారు డబ్బు". అదోలా నవ్వుతూ అన్నాడు అతను.

"ఈ డబ్బుతో నా దినం వెళుతుందా?"


మధుబాల ఇలా అంటోందేవిటి?



బొంబాయిలో వుంటూ, మద్రాసులో వుండే 'ట్రెండ్ సెట్టర్' కె. బాలచందర్ 'ద్వారా వెండితెరకు పరిచయమై మరో 'ట్రెండ్ సెట్టర్' మణిరత్నం తయారుచేసిన రోజా చిత్రం ద్వారా జాతీయ నటిగా ఎదిగిపోయిన మధుబాలకు హిందీ చిత్రాల కంటే కూడా దక్షిణాది చిత్రాలంటేనే చాలా ఇష్టమట! 'రోజా' హిందీలో ఘనవిజయం తర్వాత ఒకేసారి పది చిత్రాల ఆఫర్స్ వచ్చాయి. ఇప్పుడామె హిందీలో క్షణం తీరికలేని నటి. చిత్రం ఏమిటంటే ఆమెకు హిందీ చిత్రాల పట్ల సదభిప్రాయం లేదు! అక్కడ చిత్ర నిర్మాణంలో ఒక పద్ధతి, ఒక క్రమశిక్షణ వుండదని, ఒక వృత్తిని బాధ్యతాయుతంగా చేస్తున్న భావనే హిందీ చిత్రాల షూటింగు చేస్తున్నప్పుడు కలుగదని ఆమె భావన. దక్షిణాది చిత్రాలలో చక్కని పద్ధతి నెలకొని వుందని, ఇక్కడ షూటింగ్ చేస్తున్న భావన కలిగి కారెక్టర్స్‌లో ఇన్‌వాల్వ్ అవుతానని నిర్మొహమాటంగా తన అభిప్రాయాన్ని వెలిబుచ్చింది యువనటి.

అలాగే హిందీ చిత్రాల కంటే కూడా దక్షిణాది చిత్రాలలో హీరోయిన్ క్యారెక్టర్స్‌కు ప్రాముఖ్యముంటోందని కూడా ఆమె అన్నారు. ఈ మాటలను బట్టి మధుబాల ఎంత 'బోల్డ్ స్టార్' మనకు అర్థమవుతుంది.

— పసుపులేటి





## 'నంది' అవార్డు విజేత ఆమనితో బ్రీఫ్ ఇంటర్వ్యూ!

యువ నిర్మాత బి.మధుసూదనరెడ్డి మధు ఫిలిమ్స్ పతాకంపై అందిస్తున్న చిత్రం పోలీస్ కమెండో. ఇతర భాషా చిత్రాలైన రోజా, జెంటిల్‌మెన్ చిత్రాలు తెలుగు నాట ఎంతటి సంచలన విజయాన్ని సాధించాయో మనకు తెలుసు. ఆ కోవలో అంతటి భారీగా, మధురమైన సంగీతంతో, చక్కని డ్రామా సెంటిమెంట్‌తో తమిళంలో తయారవుతున్న చిత్రాన్ని 'పోలీస్ కమెండో' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తోంది.

ఈ చిత్రంలో హీరో విజయకాంత్ సరసన ప్రముఖ కథానాయకురాలు ఆమని, గౌతమీ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఆ మధ్య వచ్చిన తెలుగుచిత్రం 'ఆగ్రహం'ను అద్భుతంగా డైరెక్ట్ చేసి ప్రశంసల పరంపరలందుకున్న కె.ఎస్. రవి ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. ఏప్రిల్ నెలాఖరున తెలుగులో విడుదల కానున్న ఈ చిత్రంలో ఇతర ముఖ్యపాత్రలను మనోరమ, విజయకుమార్, దేవన్, సెంథిల్ మొదలైన వారు పోషించారు. ముఖ్యంగా ఈ చిత్రంలోని క్లైమాక్స్‌ను చిత్రానికి పెద్ద హైలైట్‌గా చెబుతున్నారు. మామూలుగా విజయకాంత్ చిత్రాలలో యాక్షన్ పార్ట్‌కు ఎంత ప్రాముఖ్యముంటుందో ఫామిలీ సెంటిమెంట్‌కు కూడా అంత ప్రాముఖ్యముంటుంది. పోలీస్ కమెండో చిత్రం అన్నివర్గాల ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకునే చిత్రమని చెప్పారు నిర్మాత మధుసూదనరెడ్డి. కె.రామమోహన్‌రెడ్డి సమర్పిస్తున్న ఈ భారీ చిత్రానికి రచన: రాజశ్రీ, సంగీతం: ఇళయరాజా, కెమెరా: రవి కె.చంద్రన్, డాన్స్: సుందరం, కళ: సంపత్‌రాజ్, నిర్మాత: బి. మధుసూదనరెడ్డి.

—రామారావు

"వెళ్ళదనుకో."

"మరెందుకండీ. నాక్కావాల్సినది డబ్బు కాదు అమ్మాయిగారు. బ్రతుకుతెరువు. రోజులు గడిచే మార్గం. ఈ డబ్బు వాళ్ళనే వుంచుకోమనండి"

"అలా కుదరదు తాత."

"ఎందుకు కుదరదండీ?" తాతకు కోపం వచ్చినట్లుంది.

"ఆక్రమించుకున్నవాళ్ళకే పట్టాలిస్తున్నారు కదండీ మరి. మాకు ఓ ఐదెకరాలు బంజరు భూమి ఇవ్వవచ్చుకదాండి. వ్యవసాయం చేసుకుని బ్రతుకుతాము."

నేను ఆశ్చర్యంతో స్తబ్ధురాలినైపోయాను. నిజమే! నష్టపరిహారం డబ్బుగా ఇచ్చే బదులు, ఏ బంజరు భూమో, మెట్ట భూమో ఇవ్వవచ్చు కదా! తాతలాంటి రైతులు కాయకష్టం చేసి పండిస్తారు.

కానీ అది సాధ్యమా? తలచుకుంటే ఎందుకు సాధ్యం కాదు?

డబ్బులు వదిలేసి వెళ్ళిపోయాడు తాత.

ఆరు నెలల తర్వాత ఓ రోజు తాత బస్ స్టేండులో పెట్టెలు మోస్తున్నాడని చెప్పింది వాణి.

ఓ సంవత్సరం తర్వాత మళ్ళీ కనిపించాడు తాత.

నాన్నగారితో మార్కెట్టు కెళ్ళాను. కారులోనే కూర్చున్నాను.

కూరగాయల బుట్ట మోస్తూ నాన్నగారి వెనక వచ్చాడు తాత. అతనే నన్ను పోల్చాడు.

"అమ్మాయిగారా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఎలా వున్నావు తాత? ఈ పనేమిటి?"

"మరి ఏదో ఒక పని చెయ్యాలి కదండీ. రోజులు గడవాలి కదా? పెట్టెలు మొయ్యలేక పోతున్నాను."

"మరి మీ అబ్బాయిలు, మనుమలు..."

"కూలి పనులు వెతుక్కుంటూ ఏ ఊరో వెళ్ళిపోయారు" తువ్వాలుతో కళ్ళు వత్తుకుంటూ అన్నాడు. "ఎక్కడున్నారో, ఏమో."

నాకు జాలివేసింది. ఓ ఇరువది రూపాయిల నోటు తాతకివ్వబోయాను.

"నా కెందుకమ్మాయిగారు డబ్బు?" తాత అన్నాడు. "నా ఒంట్లో ఇంకా శక్తి వుంది. పని చేసి సంపాదిస్తాను."

"నీకు కాదులే" నేను మాట మారుస్తూ అన్నాను. "సరస్వతికి గాజులు కొనుక్కోమని చెప్పు"

"ఇంకా ఎక్కడవుందమ్మా, సరస్వతి?" గొల్లుమన్నాడు తాత. "దాన్ని చదివించాలి అని ఎంతో ఆశపడ్డాం. కర్మాగారం పుణ్యమా అని దాని బ్రతుకు తెల్లారిపోయిందమ్మాయిగారు."

"ఏమిటి, ఏమిటి నువ్వంటున్నది?"

"పదో తరగతి పాసయింది కదాని దానికి దొరల హాస్టల్లో పని ఇచ్చారమ్మాయిగారు."

"మంచిది కదా!"

"ఏం మంచమ్మాయిగారు? దొరలు దాన్ని పాడుచేశారు కదండీ. సరస్వతి బావిలోపడి చచ్చిపోయిందమ్మాయిగారు."

ఖాళీ అయిన కూరల బుట్ట మొహానికి అడ్డం పెట్టుకొని అతను వెక్కి వెక్కి ఏడ్చాడు.

"ఊరుకో తాత. ఊరుకో."

"ఊరుకోక ఏం చేస్తానండీ. చేతగాని వాడిని. అందువల్లే కదా మా పొలాలు, తాతలు కట్టిన ఇల్లు గుల్ల చేస్తున్నా చూస్తూ ఊరుకున్నాను."

రోజులు గడుస్తున్నా తాతని నేను మరువ లేకపోయాను.

మరో ఆరు నెలలు పోయాక కోర్టు ఆవరణలో కనిపించాడు తాత.

అతను బాగా నీరసించిపోయాడు.

"కూరల బరువులు కూడా మొయ్యలేకపోతున్నానమ్మాయిగారు. ఇక్కడే ఏవైనా చిన్న చిన్న పనులు చేసి రోజులు గడపాలని అనుకుంటున్నాను" తాత అన్నాడు.

తాత న్యాయవాదులకు మంచినీరు అందించేవాడు. కూల్‌డ్రింక్స్, 'టీ'లాంటివి తెచ్చి ఇచ్చేవాడు. ఎవరైనా రూపాయో, రెండో ఇస్తే పుచ్చుకునేవాడు.

"ఏమిటే సత్యా నిద్రపోతున్నావా?" కుదిపి లేపింది వాణి.

ఉలిక్కిపడి లేచాను.

ఏదో గందరగోళంగా వుంది. చాలా మంది లాయర్లు బయటకు పరుగెత్తుతున్నారు.

"ఏమైంది వాణి?"

"జడ్జీగారి కారు క్రింద ఎవరో పడ్డారట. రా. పోయి చూద్దాం"

గబగబా మెట్లు దిగాము. గేటు దగ్గర చాలా మంది జనం వున్నారు. అడ్డుగా నిలచిన వారిని పక్కకి తోసి, తొంగి చూసింది వాణి.

"తాతే! కారు కింద పడిపోయాడే. పాపం చచ్చిపోయాడు" వాణి అంది.

నేను తొంగి చూశాను. ఎదురుగా పడి వుంది తాత శవం.

"తాత చచ్చిపోలేదే" నేను అన్నాను. "చంపబడ్డాడు. పారిశ్రామికాభివృద్ధికి బలి పశువు అయిపోయాడు."

నా మాటలు వాణికే వినిపించలేదేమో! ప్రశ్నార్థకంగా చూసింది. దగ్గర వున్న వాణికే నా మాటలు వినిపించకపోతే పారిశ్రామికాభివృద్ధి మీద పరుగెత్తే దేశానికి ఏం వినిపిస్తుంది!

◆